సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు కసరత్తు

- స్థల సేకరణకు రెవెన్యూ అధికారులు సర్వే
- కథలాపూర్‌లో ఆరు సబ్‌స్టేషన్ల పరిధిలో స్థలం గుర్తింపు


విద్యుత్ సబ్‌స్టేషన్

కథలాపూర్: విద్యుత్ వినియోగం రోజురోజుకూ పెరుగుతుండడంతో అందుకు తగ్గట్లు సరఫరా చేసేందుకు విద్యుత్ అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. భవిష్యత్తులో విద్యుత్ తయారీకి ఉపయోగించే వనరులు తగ్గిపోయినా.. యథావిధిగా విద్యుత్ సరఫరా చేయడానికి సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఈ మేరకు కథలాపూర్ మండలంలోని గ్రామాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్‌లకు సమీపంలో స్థల సేకరణకు రెవెన్యూ అధికారులు సర్వేలు చేపట్టారు.

మండలంలో ఆరు గ్రామాల్లో..

కథలాపూర్ మండలంలో 19 గ్రామాలున్నాయి. ఇందులో ఏడు 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాల ద్వారా విద్యుత్ సరఫరా చేస్తున్నారు. కథలాపూర్, భూషణరావుపేట, చింతకుంట, బొమ్మెన, తాండ్రాల, గంభీర్‌పూర్, అంబారిపేట గ్రామాల్లో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్నాయి. వీటికి సమీపంలో సౌర విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తే ప్రత్యామ్నాయంగా విద్యుత్‌ను సరఫరా చేయవచ్చని అధికారులు అంటున్నారు. ఒక్కో సౌర విద్యుత్ ప్లాంట్‌కు కనీసం ఐదెకరాల స్థలం అవసరమని, సబ్‌స్టేషన్‌కు 5 కిలోమీటర్ల దూరం పరిధిలో భూమి ఉంటే సరిపోతుందని ట్రాన్స్‌కో అధికారులు పేర్కొంటున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో విద్యుత్ సబ్‌స్టేషన్‌లు ఉన్న గ్రామాల్లో సౌర విద్యుత్ ప్లాంట్లకు ప్రభుత్వ స్థలం కోసం రెవెన్యూ అధికారులు ఇటీవలే సర్వే చేపట్టారు. కథలాపూర్ సబ్‌స్టేషన్ సమీపంలో సౌర విద్యుత్ ప్లాంట్‌కు ఎస్సారెస్పీ వరదకాలువ భూమిని గుర్తించారు. చింతకుంట, భూషణరావుపేట, తాండ్రాల, గంభీర్‌పూర్, అంబారిపేట గ్రామాల్లోని సబ్‌స్టేషన్‌లకు సమీపంలోనే ప్రభుత్వ స్థలాలను అధికారులు గుర్తించారు. బొమ్మెన గ్రామంలోని సబ్‌స్టేషన్‌కు సమీపంలో స్థలం కోసం అధికారులు అన్వేషిస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయితే సౌర విద్యుత్ ప్లాంట్ల నిర్మాణాలకు టెండర్లు ఆహ్వానించనున్నట్లు ట్రాన్స్‌కో అధికారులు చెబుతున్నారు. భవిష్యత్తులో ఇంధన వనరుల కొరత ఏర్పడినప్పటికీ సౌర విద్యుత్‌తో సబ్‌స్టేషన్లకు యథావిధిగా విద్యుత్‌ను సరఫరా చేయవచ్చనేది అధికారుల అభిప్రాయం.

మంచి నిర్ణయం



విద్యుత్ వినియోగం పెరిగితే కొన్నేళ్ల తర్వాత విద్యుత్ సరఫరాకు ఆటంకాలు ఏర్పడటం ఖాయం. సౌర విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేసి విద్యుత్ సబ్‌స్టేషన్‌లకు విద్యుత్ సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం మంచిది. సౌర పలకాలతో విద్యుత్ తయారీకి తక్కువ ఖర్చు అవుతుంది. ప్రభుత్వానికి ఆర్థికంగా కలిసి వస్తుంది. – కారపు గంగాధర్, యువకుడు, పెగ్గెర్ల

ఆరు గ్రామాల్లో స్థలాలు గుర్తించాం



33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో సౌర విద్యుత్ ప్లాంట్ల కోసం ప్రభుత్వ స్థలాలను గుర్తించాలని జిల్లా అధికారులు ఆదేశాలిచ్చారు. ఆయా గ్రామాల్లో సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు అనువైన స్థలాల కోసం సర్వే చేయించాం. మండలంలో ఆరు గ్రామాల్లో సౌర విద్యుత్ ప్లాంట్లకు స్థలాలను గుర్తించి నివేదిక తయారు చేశాం. – వినోద్, తహసీల్దార్, కథలాపూర్

క్లుప్తంగా

కోరుట్ల మాస్టర్ ప్లాన్ కోసం డ్రోన్ సర్వే


డ్రోన్ ప్రారంభిస్తున్న అడిషనల్ కలెక్టర్

కోరుట్ల: కోరుట్ల పట్టణంలో నూతన మాస్టర్ ప్లాన్ కోసం బుధవారం డ్రోన్ తో సర్వే నిర్వహించారు. డ్రోన్ సర్వేను జిల్లా అడిషనల్ కలెక్టర్, పట్టణ ప్రత్యేక అధికారి గౌతమ్ రెడ్డి ప్రారంభించారు. ప్రభుత్వ అమృత్ 2 పథకంలో భాగంగా సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ సర్వే నిర్వహించారు. పట్టణంలో 48 సర్వే పాయింట్లను గుర్తించామని, సర్వేకు పట్టణ ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి అన్నారు. కార్యక్రమంలో టీపీఎస్ ప్రవీణ్, మేనేజర్ శ్రీనివాస్, రమ్య, తదితరులు పాల్గొన్నారు.

మోహన్ భగవత్‌పై ఫిర్యాదు


ఫిర్యాదు చేస్తున్న నాయకులు

కొండగట్టు: ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ పై కఠినచర్యలు తీసుకోవాలని బుధవారం మండల ఎన్‌ఎస్‌యూఐ నాయకులు కొడిమ్యాల పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఇటీవల మోహన్ భగవత్ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను అవమానించడం, దేశ సార్వభౌమత్వాన్ని దెబ్బతీసేలా మాట్లాడారని, ముఖ్యంగా ఆదివాసీలపై చేసిన అనుచిత వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు తాళ్లపెల్లి విక్రమ్ గౌడ్, ఉపాధ్యక్షుడు చందు, నాయకులు సాయి, సుల్తాన్. మధు కవ్వం, నిఖిల్, భరత్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని, మందకృష్ణ చిత్రపటాలకు క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కొండగట్టు: జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల బీజేపీ శాఖ, ఎమ్మార్పీఎస్ మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు బుధవారం క్షీరాభిషేకం చేశారు.ఈ సందర్భంగా అధ్యక్షుడు బండ నరసింహారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో నాయకులు ఎలగుర్తి రవీందర్,సురుగు శ్రీనివాస్, కొత్తూరి స్వామి, పర్లపెల్లి ఆనందం,నర్సయ్య, అక్కనపల్లి నరేశ్, ప్రభుదాస్, నరసింహారెడ్డి, జనార్ధన్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు

మందకృష్ణ చిత్రపటానికి..

మల్యాల: మందకృష్ణకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ, బుధవారం మండల కేంద్రంలోని బ్లాక్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు నలువాల సంజీవ్ ఆధ్వర్యంలో సంబురాలు చేసుకున్నారు. స్వీట్లు పంపిణీ చేశారు. మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మూడు దశాబ్దాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం అలుపెరగని పోరాటం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు చిన్న దుర్గయ్య, శనిగరపు తిరుపతి, మెట్‌పల్లి అశోక్,తోడేటి బాబు, కట్కూరి దిలీప్, మునుగూరి నివాస్, బింగి వేణు తదితరులు పాల్గొన్నారు.

సీఎం,మంత్రులు, విప్ చిత్రపటాలకు..


క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మేడిపల్లి: కొండాపూర్ నుంచి ఒడ్యాడ్ వరకు రూ.7 కోట్లతో రోడ్డు, కొండాపూర్–విలాయతాబాద్ రహదారి మధ్యలో బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, విప్ ఆది శ్రీనివాస్ రేవంత్ రెడ్డి సీతక్క, పొన్నం ప్రభాకర్, ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు బుధవారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మేడిపల్లి, భీమారం మండలాల అధ్యక్షుడు ఏనుగు రమేశ్ రెడ్డి, సింగిరెడ్డి నరేశ్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మాదం వినోద్, వైస్ చైర్మన్ మిట్టపల్లి రాజారెడ్డి , మరిపెల్లి స్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

ధర్మపురి: గద్దర్‌పై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బుధవారం ఆయన దిష్టిబొమ్మను ధర్మపురిలోని గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. 70 ఏళ్ల పాటు ప్రజల కోసం గద్దం గొంతు ఆడింది పాడిందని, రజాకార్ల పాలన మీద యుద్ధం చేసింది గద్దర్ కాదా అంటూ ఆయన పాటలతోనే దొరల పాలనకు దడ పుట్టించాడన్నారు. తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసిన గొప్ప వ్యక్తి గద్దర్ అని ఇంతటి మహోన్నతమైన వ్యక్తిపై చేసిన అనుచిత వ్యాఖ్యలు ఉప సంహరించుకోవాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్, ఉపాధ్యక్షుడు పాల గణేష్, నాయకులు రాందేని మొగిలి, అప్పం తిరుపతి, చీపిరిశెట్టి రాజేష్, ఎన్ఎస్‌యుఐ నియోజకవర్గ అధ్యక్షుడు అప్పం శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

మల్లికార్జున ఖర్గే దిష్టిబొమ్మ దహనం


దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

ధర్మపురి: హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యాఖ్యలు చేసిన ఆలిండియా కాంగ్రెస్ కౌన్సిల్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దిష్టిబొమ్మను పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద బీజేపీ ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సందర్భంగా పట్టణశాఖ అధ్యక్షుడు గాజు భాస్కర్ మాట్లాడుతూ కుంభమేళా అనేది హిందువుల సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణమైనదని అటువంటి వ్యవస్థపై అవమానించే విధంగా మాట్లాడి హిందువులను రెచ్చగొట్టే విధంగా మాట్లాడం బాధాకరమన్నారు. నాయకులు లవన్ కుమార్, ఆకుల శ్రీనివాస్, సత్యనారాయణ, దివిటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి


మాట్లాడుతున్న విశ్వబ్రాహ్మణ నాయకులు

మల్లాపూర్: మాజీ సర్పంచ్ వనతడుపుల నాగరాజుకి రావాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పోలాస రాజయ్య చారి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులతో కలిసి మాట్లాడారు. సర్పంచ్‌ల పదవి కాలం ముగిసి ఏడాది గడుస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఆ మాజీ సర్పంచ్‌లకు పెండింగ్ బిల్లులను విడుదల చేయకపోవడం దారుణమన్నారు. ఆర్థిక ఇబ్బందులతో మాజీ సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, వారి కుటుంబాలు వీధులపాలవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా నాగరాజు బిల్లులు విడుదల చేయాలని కోరారు. సమావేశంలో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు పిప్పోజి శ్రీనివాస్, దొంతి సుధాకర్, వెంకటేశ్వర్లు, తుమ్మనపెల్లి వెంకటరమణ, మానాల శ్రీనివాస్, దొంతి సుభాష్, సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం ఎదురుచూపులు


రేచపల్లి సొసైటీ వద్ద రైతులు

సారంగాపూర్: మండలానికి ఈ రబీలో ప్రభుత్వం ఎంత యూరియా పంపించినా రైతులు మాత్రం ఇంకా యూరియా కోసం నిరీక్షిస్తూనే ఉన్నారు. మండలంలో సారంగాపూర్ సొసైటీ ద్వారా ఇప్పటికి 382 మెట్రిక్ టన్నులు (8400 బ్యాగులు) యూరియా పంపిణీ చేయగా, డీసీఎంఎస్ ద్వారా 100 మెట్రిక్ టన్నులు (2500 బ్యాగులు) రైతులకు పంపిణీ చేశారు. అయినా రైతులు యూరియా కోసం ఎదురుచూడాల్సి వస్తుంది. దీనికి ప్రధాన కారణం సారంగాపూర్ మండలంలో సగం వరిసాగు చేయగా, మరో సగం లక్ష్మీదేవిపల్లి, అర్పపల్లి, పెంబట్ల, కోనాపూర్, పోచంపేట, నాగునూర్, లచ్చక్కపేట, రంగపేట, ఒడ్డెరకాలనీ, రేచపల్లి గ్రామాల్లో మొక్కజొన్న సాగు విస్తీర్ణం వరితో సమానంగా వేశారు. దీంతో యూరియా మొక్కజొన్నకు ఎక్కువ వినియోగించాల్సి వస్తుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. గురువారం మరో 40 మెట్రిక్ టన్నుల యూరియా వస్తున్నట్లు విండో సీఈవో లైశెట్టి శివ తెలిపారు.

ఆహార వేటకు రోడ్డు పైకి..


ఆహారం కోసం రోడ్డు వద్ద ఉన్న వానరాలు

బుగ్గారం: రోడ్డుపై వెళ్లే వాహనదారులు వేసే ఆహార పదార్థాల కోసం వానరాలు రహదారిపైకి వస్తూ ప్రాణాలు కోల్పోతున్నాయి.అలాగే పలువురు వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. బుగ్గారం మండలంలోని వెల్గొండ సమీపంలోని అటవీ ప్రాంతంలో జాతీయ రహదారిపై పలు చోట్ల వానరాలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ వాహనదారులు వేసే ఆహార పదార్థాల కోసం రోడ్డు పైకి వస్తున్నాయి. అలాగే స్టేజీ వద్ద ఆగిన ప్రయాణికులపై దాడి చేస్తూ వారి వద్ద గల సంచులు, బ్యాగులను చించివేస్తున్నాయి. ఈ క్రమంలో పలువురు ప్రయాణికులకు గాయాలు కావడంతో పాటూ రోడ్డుపైకి రావడంతో కోతులూ మృత్యువాత పడుతున్నాయి. కోతులకు ఆహారం అందించకూడదని బోర్డులు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

సూపరింటెండెంట్‌ను నియమించండి


డీఎంఈని కలిసిన ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: జిల్లాకేంద్రంలోని జనరల్ ఆస్పత్రికి పూర్తిస్థాయి సూపరింటెండెంట్‌ను నియమించాలని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ బుధవారం హైదరాబాద్‌లో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అధికారి నరేంద్రకుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. సూపరింటెండెంట్ లేకపోవడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో సాక్షిలో 'గాడితప్పిన ఆస్పత్రి' శీర్షికన మంగళవారం కథనం ప్రచురించడంతో ఎమ్మెల్యే స్పందించారు. వెంటనే సూపరింటెండెంట్‌ను నియమించాలని కోరారు. ఆయన వెంట డీఎంఈ శివరాంప్రసాద్ ఉన్నారు.

హైదరాబాద్,నిర్మల్‌కు బస్సులు నడిపించాలి

ఇబ్రహీంపట్నం:ఇబ్రహీంపట్నం నుంచి హైదరాబాద్, నిర్మల్‌కు బస్సులను నడపాలని మాజీ ఎంపీపీ జాజాల భీమేశ్వరి కోరారు. మెట్‌పల్లి డిపోకు చెందిన బస్సులను మెట్‌పల్లి, వయా గోధూర్ కామారెడ్డి ద్వారా హైదరాబాద్‌కు , మెట్‌పల్లి నుంచి వయా గోధూర్, ఇబ్రహీంపట్నం, నిజామాబాద్ జిల్లా ఎర్గట్ల మీదుగా నిర్మల్‌కు బస్సులను నడిపించాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్‌కు విన్నవించనున్నట్లు ఆమె తెలిపారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

కథలాపూర్: మండలంలోని పోతారం గ్రామంలో ఆంజనేయులు(40) అనే అనాథ వ్యక్తి అనారోగ్యంతో మృతిచెందగా... గ్రామస్తులు బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఆంజనేయులు గత 10 ఏళ్లుగా గ్రామంలో టాపీ మేస్త్రీ, కూలీ పనిచేస్తూ ఒంటరిగా ఉండేవాడు. అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందాడు. మాజీ సర్పంచ్ ధర్మపురి జలందర్ తన సొంత ఖర్చులతో అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు పులి హరిప్రసాద్, యాటకర్ల అశోక్, శేఖర్, రాజేందర్, మధు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

జగిత్యాల: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని బీఎంఎస్ జాతీయ కార్యవర్గ సభ్యుడు సుధీర్‌కుమార్ అన్నారు. సిద్దిపేటలో జరుగుతున్న బీఎంఎస్ రాష్ట్ర రెండో మహాసభకు జగిత్యాల నుంచి నాయకులు తరలివెళ్లారు. కార్యక్రమంలో క్యాదాసు నాగయ్య, సత్యనారాయణ, శ్రీనివాస్, శంకర్, కిషన్, రాజేశం పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

మల్యాల: అల్ఫోర్స్ ఎస్ఎస్వీ పాఠశాల క్రీడాకారులు పి.అక్షయ, ఎం.శర్మిలను జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని జగిత్యాల కలెక్టరేట్ కార్యాలయంలో సన్మానించారు. విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి విద్యార్థులను అభినందించారు. ఎస్‌జీఎఫ్, సీఎం కప్ కరాటే, కిక్ బాక్సింగ్ పోటీల్లో రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చారని తెలిపారు. విద్యార్థులతో పాటు కరాటే మాస్టర్ మర్రి శ్రీనివాస్‌ను అభినందించారు.


కోరుట్ల రూరల్: మండలంలోని సంగెం శివారులోని రామస్వామి గుట్ట ముందర హైటెన్షన్ తీగలు ఉన్న విద్యుత్ స్తంభం గత కొంత కాలంగా విరిగి ఉన్నప్పటికీ విద్యుత్ అధికారులు స్తంభాన్ని మార్చటం లేదు. ఈదురుగాలులు వీస్తే స్తంభం విరిగిపడే ప్రమాదం ఉందని స్తంభాన్ని మార్చాలని రైతులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
శ్రీనివాస్ నాయక్, ఏఈ,ట్రాన్స్‌కో రూరల్, కోరుట్ల, సెల్ నంబర్: 9491245473

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

హామీల అమలు పక్క దారికే ఎంపీపై విమర్శలు


మాట్లాడుతున్న మధుకర్

మేడిపల్లి: కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలును పక్కదారి పట్టించడానికే కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పై విమర్శలు చేస్తున్నారని బీజేపీ ప్రధాన కార్యదర్శి కారండ్ల మధుకర్ అన్నారు. బుధవారం మేడిపల్లిలో మాట్లాడారు. కొన్ని రోజులుగా కాంగ్రెస్ నాయకులు పని గట్టుకుని మరి, ఎంపీ బండి సంజయ్‌ని బదనాం చేసే ప్రయత్నం చేస్తున్నారని పద్మశ్రీ అవార్డుల విషయంలో గద్దర్ విషయం తెరపైకి తెచ్చి నాలుగు హమీలు విషయం పక్కదారి పట్టించడానికే అన్నారు. కార్యక్రమంలో వేములవాడ బీజేపీ కన్వీనర్ క్యాతం దశరథ రెడ్డి, మండల అధ్యక్షుడు ముంజ శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు ఎస్.ఎన్ రెడ్డి, నాయకులు కొపెరా లింగరెడ్డి, అన్నాడి జలపతి రెడ్డి, గోస్కీ మధు, చంద రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ సమస్యలు పరిష్కరించాలి


పోస్టు కార్డులు పంపుతున్న సీనియర్ సిటిజన్లు

జగిత్యాలటౌన్: సీనియర్ సిటిజన్ల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్‌కుమార్ డిమాండ్ చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు పి.నర్సింహారావు పిలుపు మేరకు బుధవారం జగిత్యాలలో సమావేశమైన సంఘం ప్రతినిధులు తమ సమస్యలు, డిమాండ్లను పోస్టుకార్డుపై రాసి ప్రధాని మోదీ, సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టు చేశారు. అనంతరం అశోక్‌కుమార్ మాట్లాడుతూ వృద్ధులకు ఆదాయపు పన్ను రద్దు చేయాలని కోరారు. నిలిపివేసిన రైల్వే రాయితీలు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గౌరిశెట్టి విశ్వనాథం, వెల్ముల ప్రకాష్‌రావు, పీసీ హన్మంతరెడ్డి, ఎండీ యాకూబ్, పీ. సతీష్‌రాజ్, ఎండీ ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో వృద్ధురాలి మృతదేహం

కోరుట్ల రూరల్: మండలంలోని మోహన్‌రావుపేట శివారులోని చిలుక చెరువులో గ్రామానికి చెందిన కుంట లింగమ్మ (80) అనే వృద్ధురాలు మృతదేహం లభ్యమైంది. గ్రామస్తుల వివరాల ప్రకారం గ్రామ శివారులోని చిలుక చెరువు సమీపంలో కుక్కలు వృద్ధురాలి తలను పడవేశాయి. స్థానికులు వెళ్లి చూడగా చెరువులో లింగమ్మ మృతదేహం కనిపించింది. లింగమ్మకు మతి స్థిమితం లేక గత నెల రోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్లి పోయింది. కుమారుడు కుంట రవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ కంచె తగిలి అడవి పంది మృతి

కథలాపూర్: మండలంలోని చింతకుంట గ్రామ శివారులో పంట పొలానికి ఏర్పాటు చేసిన విద్యుత్ కంచె తగిలి అడవిపంది మృతిచెందడంతో భూమి యజమాని తిరుపతి నాయక్‌పై కేసు నమోదు చేసినట్లు అటవీశాఖ అధికారులు బుధవారం తెలిపారు. భూషణరావుపేట గ్రామానికి చెందిన తిరుపతినాయక్ తన పంట పొలం వద్ద విద్యుత్ కంచె ఏర్పాటు చేశారు. ఈ కంచెకు తగిలి అడవిపందితోపాటు రెండు గొర్రెలు మృతి చెందాయన్నారు. ఈ విషయం తెలుసుకున్న అటవీ శాఖ కోరుట్ల డెప్యూటీ రేంజ్ ఆఫీసర్ సురేశ్‌కుమార్, బీట్ ఆఫీసర్లు శివరాజ్, సాయిరాం, శ్రావణ్ బుధవారం సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. తిరుపతినాయక్‌పై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. కాగా అడవి పంది కళేబరానికి పశువైద్యాధికారులు దివ్యశ్రీ, శ్రీనివాస్ పోస్టుమార్టం చేశారు.

రైతుల శ్రమదానం

ధర్మపురి: రైతుల శ్రేయస్సు కోసం కాలువల ద్వారా నీటిని విడుదల చేసేందుకు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కృషి పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని దోనూర్ గ్రామంలోని ఎస్సారెస్పీ కాలవ ద్వారా నీరందించాలని కోరగా బుధవారం డీ–53 ద్వారా నీరందించారని తెలిపారు. కాలువలో పేరుకు పోయిన చెత్తాచెదారాలను రైతులు తొలగించారు. కార్యక్రమంలో ఏఎంసీ ఉపాధ్యక్షుడు సంఘ నర్సింహులు, రైతులు జంగిలి ప్రభాకర్, గౌతమ్, రాజయ్య, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లపై ఆరోపణలు సరికాదు

రాయికల్: ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో ఉపాధి కూలీలను ఎంపిక చేయలేదని తమను కూలీలు వేధిస్తున్నారని బుధవారం ఫీల్డ్ అసిస్టెంట్లు ఎంపీడీవో చిరంజీవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్లు మాట్లాడుతూ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో ఆన్‌లైన్‌లో మాత్రమే ఎంపిక చేశారని, దీనిలో ఫీల్డ్ అసిస్టెంట్లకు సంబంధం లేదన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లను దూషించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు భూక్య తిరుపతి, నసీర్, లక్ష్మణ్, మహేశ్, మల్లేశం, శ్రీనివాస్, నర్సయ్య, తిరుపతి, రవి పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా రమేశ్

రాయికల్: మండలంలోని ఇటిక్యాలలో విశ్వబ్రాహ్మణ సంఘం కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చందనగిరి రమేశ్, ఉపాధ్యక్షుడిగా గాలిపెల్లి స్వామి, ప్రధాన కార్యదర్శి కనపర్తి శ్రీనివాస్, కోశాధికారిగా ఎదురుగట్ల రవీందర్, గౌరవ సలహాదారులుగా కొడిమ్యాల లింగమూర్తి, మండలోజు శ్రీనివాస్, శంకరయ్య, మనోహర్, లక్ష్మీనారాయణ ఎన్నికయ్యారు.

సీఐ నిరంజన్‌రెడ్డికి సన్మానం

మల్లాపూర్: కేంద్ర ప్రభుత్వం చేతుల మీదుగా ఇండియన్ పోలీస్ మోడల్ అందుకున్న మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డిని బుధవారం కిసాన్‌కాంగ్రెస్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ వాకిటి సత్యంరెడ్డి, కాంగ్రెస్ నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎండీ.జాఫర్, రాజేందర్, ఎడ్ల రాజు, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు ..

ఇబ్రహీంపట్నం: ఎంపీడీవో చంద్రశేఖర్ ఈ నెల 26న జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ చేత అవార్డు తీసుకోవడంతో బుధవారం మండల పంచాయతీ కార్యదర్శులు ఘనంగా సన్మానించారు. ఫకీర్‌కొండాపూర్ కార్యదర్శి రాజశేఖర్‌ను కూడా సన్మానించారు.

సమాచారం

4 రోజులు నీటి సరఫరా నిలిపివేత

కోరుట్ల: పట్టణంలో నాలుగు రోజులు మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిపి వేస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇబ్రహీంపట్నం మండలంలోని డబ్బా పంప్ హౌస్‌లో మరమ్మతుల కారణంగా ఈ నెల 30 వ తేదీ నుంచి ఫిబ్రవరి 3 వరకు నీటి సరఫరా నిలిపి వేస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఇబ్రహీంపట్నం: మండలంలోని గోధూర్, ఇబ్రహీంపట్నం సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో గురువారం దయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరాఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సతీశ్ బుధవారం తెలిపారు.